విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర- భీమవరం: కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేందుకు సంకల్పించిన విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమావేశ మందిరంలో విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర-2023 విధి విధానాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే దిశగా విస్తృత ప్రచారానికి విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరిట మొబైల్ వ్యాన్ యాత్రను దేశంలోని అన్ని ప్రాంతాల్లో చేపట్టినట్టు తెలిపారు. విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణ, గ్రామాలలో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈనెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని పంచాయతీలలో యాత్ర సాగుతుందన్నారు. పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన ఆర్థిక సేవలు, ఎల్‌పిజి కనెక్షన్‌లకు ప్రాప్యత, పేదలకు గృహాలు, ఆహార భద్రత, సరైన పోషకాహారం, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య మొదలైన ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి, రూపొందించడం ఒక లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి. శివ రామ ప్రసాదు, డియస్‌వో యస్. సరోజ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లిఖార్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత భూములకు కొత్త పట్టాలు

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇచ్చిన భూములకు జగన్ ప్రభుత్వం కొత్త పట్టాలు ఇవ్వటం హాస్యాస్పదమని టీడీపీ నాయకులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం టిడిపి నూజివీడు కార్యాలయంలో టీడీపీ, జనసేన పార్టీల నియోజకవర్గ స్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ పట్టాల పంపిణీ కార్యక్ర మంలో ముఖ్యమంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రజలకు చెప్పినవన్నీ అవాస్తవాల న్నారు. గతంలోనే పట్టాలు పొందిన లబ్ధిదారులకు తిరిగి పట్టాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొత్తగా భూములు సేకరించి భూమిలేని నిరుపేదలకు పంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముసు నూరు రాజా, దుర్గాప్రసాద్, నూతక్కి వేణు, జగదీష్, రాజశేఖర్, రాజ్ కుమార్, వెంకటరెడ్డి, చిట్టిబాబు, శివరామకృష్ణ, ఎం. కామేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు, గంగిరెడ్ల మేఘలాదేవి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నూజి వీడులో జరిగిన భూపట్టాల పంపిణీ కార్యక్ర మంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తన ఉపన్యా సంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 2 లక్షల 40 వేల ఉద్యోగాలు కల్పించి వాటిలో 80 శాతం ఎస్సీలకు రిజర్వేషన్ ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పించానని మోసపూరిత మాటలు చెప్పారని ఆమె విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారి నివాస ప్రాంతాలలోనే వినియోగించాలని చట్టం చెబుతున్నప్పటికీ ఆ నిధులు దారి మళ్లించి సంక్షేమ పథకాలకు కేటాయించి దళితుల అభ్యున్నతికి కృషి చేసామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 53 మాసాల వ్యవధిలో రాష్ట్ర అభివృద్ధిపై గణాంకా లతో శ్వేత పత్రం విడుదల చేసి పాలనపై చిత్తశుద్ధి రుజువు చేసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రేషన్ వాహనాలపై మోడీ ఫొటో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: రేషన్ వాహనాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జె వి సుబ్బారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆహార ధాన్యాల కోసం 6 వేల కోట్లు వెచ్చిస్తుందని తెలిపారు. ఆహార ధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం 60శాతం మిగిలిన 40శాతం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో రేషన్ పంపిణీ చేసే 9260 వాహనాల పై మోడీ ఫోటో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో యువ మోర్చా మండల అధ్యక్షులు పాపోలు పూర్ణ శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం. వీర్రాజు, కుసుని వీర్రాజు, మక్కిన శ్యామసుందరరావు, రాయల నాగ మల్లేశ్వరరావు, కుంచె గంగాధరరావు, జి. హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పట్ల ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు తెలుగు భాష పట్ల ఆశక్తి పెంచుకోవాలని టీ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కె. కుటుంబరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం వ్యాస రచన, నీతి పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుటుంబరావు మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాష పట్ల ఆసక్తి, పదజాల అభివృద్ధి, నీతి పద్యాల ద్వారా నైతిక విలువలు, పెద్దల పట్ల వినయవిధేయతలు, క్రమశిక్షణ నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ చైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు, గ్రంథాలయ పాలకులు ఆర్. కిషోర్, విజన్ యు.పి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు కె. రాజు, సాయి సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ కె.పవన్ కుమార్, హిందీ ఉపాధ్యాయులు షేక్ యాకూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైన రంగాన్ని ఎంచుకుంటేనే గుర్తింపు సాధ్యం

విశాలాంధ్ర-మండవల్లి: మనస్సుకు నచ్చిన రంగాన్ని ఎంచుకుంటే ఉన్నత స్థితికి చేరవచ్చని సినీ గేయ రచయిత,నటుడు చేగొండి అనంత శ్రీరాం అన్నారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా సామాగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండవల్లిలో బండి రంగారావు ఇంటివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ గేయ రచయితగా, నటుడుగా నేడు గుర్తింపు పొందానంటే తనకు నచ్చిన రంగాన్ని ఇష్టంగా ఎంచుకోవటం వల్లనే సాధ్యమైందన్నారు. ప్రతి ఒక్కరు సమాజంలో గుర్తింపు పొందాలంటే వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకోవాలన్నారు. సినీ గేయాలని ఆలపించి స్థానికులను ఉర్రూతలూగించారు. తొలుత బిజెపి నాయకులు శ్రీరాంను ఘనంగా సన్మానించారు. శ్రీరాంతో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

డబ్బే లక్ష్యం... కోతలే మార్గం

- సచివాలయాల ఆదాయం సర్కారుకే
- పథకం ప్రకారం మీ సేవల నిర్వీర్యం
- ధ్రువీకరణ పత్రాలన్నీ గ్రామ, వార్డు సచివాలయాల నుంచే

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: డబ్బే లక్ష్యం... కోతలే మార్గం అన్న చందంగా రాష్ట్ర సర్కారు పరిస్థితి ఉంది. ఆదాయం కోసం ఎక్కడ కనపడితే అక్కడ చటుక్కున వాలిపోతోంది. అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టో.. ప్రజల నెత్తిన భారాలు మోపో... ఎంత ఆదాయం వస్తే అంతలాగేసుకుంటోంది. తాజాగా గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవల ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఎంచక్కా సర్కారు గుంజేసుకుంటోంది.ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే సంస్థలకు గతంలో ప్రభుత్వం కొంతమేర కమీషన్ ఇచ్చేవి. దాంతో తమ కార్యాలయ స్టేషనరీ ఖర్చులు, ప్రొటోకాల్ ఖర్చులు జరిగేవి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఈ కమీషన్‌ను రాకుండా నియంత్రించింది. దీంతో కొత్తగా ఏర్పాటైన గ్రామ,వార్డు సచివాలయాలకు స్టేషనరీ ఖర్చులకు దిక్కులేకుండాపోయింది. రెవెన్యూ కార్యాలయాలకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ శాఖల్లోని సేవలు పొందటానికి మీ - సేవల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించినప్పటికీ ప్రతి ధ్రువీకరణ పత్రానికి కొంతమేర కమీషన్ రూపంలో సంబంధిత రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లేది. ఈడబ్బుతో రెవెన్యూ కార్యాలయాల్లో కంప్యూటర్ ప్రింటింగ్ పేపర్స్, ఇతర స్టేషనరీని కొనేవారు. ఏదైనా అధికారిక సమావేశాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాల సందర్భంలో ప్రొటోకాల్ ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించేవారు. దీంతో ప్రభుత్వాలు రెవెన్యూ కార్యాలయాలకు నగదు కేటాయించక పోయినా కమీషన్‌తో సర్దుబాటు చేసుకునేవారు.

కమీషన్‌కు కత్తెర

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. సచివాలయాలలో ధ్రువీకరణ పత్రాల జారీని అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు ఎప్పుడైతే సజావుగా సాగుతున్నాయో అదే సమయంలో మీ- సేవలకు ప్రభుత్వం కత్తెర వేసింది. మీ-సేవల నుంచి ఒక్కో ప్రభుత్వ సేవలను తగ్గిస్తూ వస్తోంది. రెండు నెలలుగా మీ-సేవల నుంచి ధ్రువీకరణ పత్రాలకు వచ్చే దరఖాస్తులను స్వీకరించడం లేదు. చెల్లుబాటు అవ్వదని తిరిగి దీంతో గ్రామ సచివాలయాల ద్వారా తీసుకునే దృవపత్రాలకు దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి కూడా సచివాలయాల ద్వారా తీసుకునే ధ్రువీకరణ పత్రాలనే స్వీకరిస్తున్నారు. మీ-సేవల ద్వారా తీసుకునే ధ్రువపత్రాలను తీసుకోవడం లేదు. దీంతో మీ-సేవలకు ధ్రువీకరణ పత్రాలకు వచ్చే దరఖాస్తులు కూడా తగ్గిపోయాయి. ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి వాటి కేటగిరీని బట్టి రూ.50 నుంచి 100 వరకు వసూలు చేస్తారు. ధ్రువీకరణ పత్రం జారీ చేయడానికి ప్రభుత్వానికి అయ్యే ఖర్చు రూ.2 కూడా ఉండదు. ప్రింట్ తీయడానికి రూ.1, స్టేషనరీ కి రూ.1 మాత్రమే ఖర్చు అవుతుంది. మిగిలిన రూ.48 చార్జీలలో రూ.8 గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి శాఖలకు కేటాయిస్తే ఆయా శాఖలకు స్టేషనరీ తగ్గుతుంది. మీ - సేవల ద్వారా కమీషన్ నిలిపి ప్రభుత్వం పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పరిధిలోకి ధ్రువీకరణ పత్రాల జారీని తీసుకువస్తే స్థానికంగా అయ్యే ఖర్చులకు డబ్బులు ఇస్తామని తొలుత ప్రభుత్వం చెప్పింది. కానీ నేటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

నగదు లేక కునారిల్లుతున్న సచివాలయాలు

రెండు జిల్లాలలోని గ్రామ, వార్డు సచివాలయాల నిర్వహణకు నగదు లేక కునారిల్లుతున్నాయి. ప్రింట్లు తీసుకోవడానికి కూడా పేపర్లు ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితులలో సచివాలయ ఉద్యోగులు సొంతంగా ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. సచివాలయ వ్యవస్థ మకిలిపట్టే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని గ్రామ,వార్డు సచివాలయాలకు స్టేషనరీ సరఫరా లేదా ఖర్చుల నిమిత్తం నగదు ఇస్తే ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రిక సచివాలయ వ్యవస్థ పటిష్టంగా అమలు జరిగి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. లేదంటే మీ-సేవల మాదిరిగానే నిర్వీర్యం అయ్యే ప్రమాదం పొంచి ఉంది.

అర్హులందరికీ సంక్షేమ పథకాల కోసమే కులగణన

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అన్ని నిరుపేద కులాల వారికి అందించడమే కుల గణన ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో కుల గణన నిర్వహణపై వివిధ వర్గాల ప్రజలకు అవగాహన, సూచనలు స్వీకరణకై శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అన్ని నిరుపేద వర్గాలకు సామాజిక న్యాయం అందించాలన్నదే కులగణన ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో కులగణన సర్వే ఈనెల 27వ తేదీ నుండి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కుల గణనను తాను స్వాగతిస్తున్నామన్నారు. యాప్ లో కోరిన వివరాలతో సమగ్ర సమాచారం రాదని, వీటిలో మరికొన్ని అంశాలను చేర్చవలసి ఉందన్నారు. సమావేశంలో మెండెం సంతోష్ కుమార్, దేవరకొండ వెంకటేశ్వర్లు, అప్పభక్తుల శివకేశవరావు, పొలిమేర హరికృష్ణ, చప్పిటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పేదల అభ్యున్నతి

విశాలాంధ్ర-తణుకు : పార్టీలకు అతీతంగా పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ సామాజిక న్యాయం చేస్తున్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరేనని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు పట్టణంలో సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శనివారం నెక్ ఫంక్షన్ హాల్‌వద్ద ఏర్పాటుచేసిన పత్రికల సమావేశంలో మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తదితరులు మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేశాక నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో వారి వాళ్లకు, ఆయన పార్టీ వాళ్లకు మాత్రమే పనిచేయాలని చెప్పారన్నారు. కానీ సీఎం జగన్ మాత్రం కులం, మతం, పార్టీలు అని చూడకుండా ప్రతి పేదవాడికి మేలు చేయాలని చెప్పారని, అదే చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో వివక్షకు గురైన అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చి సంక్షేమ పథకాల ద్వారా వారి అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్, పోతుల సునీత, జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ, శెట్టిబలిజ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ చలం ఆనంద ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి

విశాలాంధ్ర - కలిదిండి: హాస్టల్ వార్డెన్లు హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఎంఈఓ పి. ప్రభాకర్ వార్డెన్లుకు సూచించారు. శనివారం కలిదిండి బిసి బాలుర హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లితండ్రుల వద్ద నుంచి హాస్టల్ లో ఉంటు చదువుకుంటున్నారని వారికి మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నది పరిశీలించి, బయోమెట్రిక్ లో విద్యార్థుల వేలిముద్రలు సరిపోయినట్లు తెలిపారు. గదులను, వాష్ రూములను తనిఖీ చేశారు, అనంతరం హాస్టల్ రికార్డులను వార్డెన్ శివ చూపించడంతో రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిపారు.

మున్సిపల్ కమినర్‌ను కలిసిన బొద్దాని

విశాలాంధ్ర-తణుకు: తణుకు పురపాలక సంఘ కమినర్‌ను శుక్రవారం సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు కలిశారు. తణుకు పట్టణ పురపాలక సంఘ కమిషనర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలను చేపట్టిన సందర్భంగా కమిషనర్ బి.వి రమణను మర్యాద పూర్వకంగా శుక్రవారం ఆయన కలిశారు. ఆయన వెంట ఏఐటీయుసి నాయకులు మందుల ముత్తయ్య, కొమ్మోత్తుల రవికుమార్, గిద్దా అన్నపూర్ణ, సరేపల్లి రాము, మందుల రాము తదితరులు ఉన్నారు.

30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జలాల పునః పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 20,21 తేదీల్లో విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 18 జిల్లాల్లో 440 మండలాల్లో కరువు కారణంగా పంటలు పూర్తిగాఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల వలన పంటలు ఎండిపోతే ముఖ్యమంత్రి జగన్ కరువుపై మాట్లాడటానికి ఇష్టపడకపోవడం దురదృష్టకరం అన్నారు. తక్షణమే రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేసి జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని రైతులకు, సాగునీటి రంగానికి కేంద్రం, బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు తీరని ద్రోహం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల పునః పంపిణీ గజిట్ నోటిఫికేషన్ తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ చేస్తున్న నిరసన లో ఏలూరు జిల్లా నుండి రైతులు, ప్రజా సంఘాలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

30 గంటల నిరసన దీక్ష గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం: నవంబరు 20, 21వ తేదీల్లో విజయవాడలో సీపీఐ చేపట్టిన 30 గంటల నిరసన దీక్ష విజయవంతం చేయాలని కోరుతూ పాలకోడేరు మండలం వేంద్రలో సీపీఐ నాయకులు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్ల బోయిన రంగారావు మాట్లాడుతూ కృష్ణా జలాల పుపఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్ తక్షణం రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో కరువు పీడిత మండలాలను తక్షణమే ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మిగులు జలాలపై వివాదం సుప్రీం కోర్టులో నడుస్తుండగా మోడీ సర్కారు కృష్ణా జలాలపై నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో 448 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుం డగా కేవలం 103 మండలాల్లోనే కరువు నెలకొందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమని అన్నారు. వేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు , కూలీలు వలసబాట పట్టారని, పశుగ్రాసం లేక జీవాలను కబేళాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 20, 21వ తేదీల్లో విజయవాడలో సీపీఐ చేపట్టిన 30 గంటల నిరసన దీక్ష విజయవంతం చేయాలని చెల్లబోయిన కోరారు. కార్యక్ర మంలో సిపిఐ నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మిపతి, అరకట్ల నాగేశ్వరరావు, మల్లుల అప్పారావు, ఎ.చిన్న , మల్లుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మృతి బలహీన వర్గాలకు తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: మల్లుల సత్యనారాయణ మృతి బడుగు, బలహీన వర్గాలకు తీరనిలోటని ఆయన ఆశయ సాధనకు యువత ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ సిపిఐ నాయకులు మల్లుల సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఆయన వేంద్రలో శనివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ వేంద్ర డెల్టా పేపర్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మాజీ ఉపాధ్యక్షునిగా, ఏఐటీయూసీ నాయకునిగా మల్లుల సత్యనారాయణ కార్మిక వర్గానికి సేవలందించారని కొనియాడారు.కార్మిక హక్కుల సాధనకు జరిగిన అనేక పోరాటాల్లో తనవంతు కృషి నిర్వహించేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మిపతి, అరకట్ల నాగేశ్వరరావు, మల్లుల అప్పారావు, ఎ.చిన్న , మల్లుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మందపాటి వారి ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర -చాట్రాయి : ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి మందపాటి కాంతా రెడ్డి నాగరత్నమ్మ జ్ఞాపకార్థం ప్రోత్సాహకాలను అందజేశారు . శనివారం చాట్రాయి హైస్కూలు, ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో కీర్తిశేషులు శ్రీ మందపాటి కాంతారెడ్డి, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం వారి మనుమళ్ళు, మనుమరాళ్ళు సిహెచ్ ఆనిత, ఎం. అరుణ ,గోలిసత్యనారాయణ రెడ్డి చల్లా కిషోర్ రెడ్డి ఎమ్ పూర్ణ చంద్రారెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతి లో 1,2,3 స్థానాలు పొందిన వవిద్యార్థులకు నగదు బహుమతులు,తరగతి హాజరులో ప్రతి తరగతిలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు 500 రూపాయలు బహుమతిగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. క్రిష్ణయ్య విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు శనివారం ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం నూజివీడు పర్యటన సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయుసి నాయకులు చాట్ల పుల్లారావు లను అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజల సమస్యలను ముఖ్యమంత్రికి చెప్పుకునే అవకాశాలు లేవా అని ప్రశ్నించారు. భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తే రాబోయే కాలంలో ప్రజలు, ప్రతిపక్షాలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కళాత్మక, విలక్షణ దర్శకుడు శాంతారాం

విశాలాంధ్ర -భీమవరం: కళాత్మక, వ్యాపార దృక్పథాలను మేళవించిన విలక్షణ దర్శకునిగా శాంతారాం రాజారాం వణకుద్రే పేరుగాంచారని ఎ.పి.ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారామ ప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పట్టణ కళాకారుల సంఘం అధ్వర్యంలో చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు శాంతారాం జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లుల సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ కోట్నీస్ కీ అమర్ కహానీ, అమర్ భూపాలి,దో ఆంఖె బారహ్ హాథ్, నవరంగ్, దునియా నా మానే, పింజ్రా వంటి చిత్రాలతో అందరికి సుపరిచితుడని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కే చాన్ పాషా, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు, సుంకర చందు, గంటా సుందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర -భీమవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం శాఖ గ్రంథాలయంలో యువజన దినోత్సవం సదస్సు నిర్వ హించి, గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒన్ టౌన్ సిఐ అడబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను బాల్యం నుండి గ్రంథాలయాలకు అలవాటు చేయాలన్నారు. గ్రంథాలయాల ద్వారా జ్ఞాన సంపద వృద్ధి చెందుతుందని, పిల్లలు మంచిని గ్రహించి చెడును విడనాడాలని, జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ, గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - లింగపాలెం : సచివాలయాల పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ ఆశీర్వాదం తెలిపారు. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు కార్యక్రమంలో సచివాలయ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని తెలిపారు. గ్రామాలలో అర్హులైన ప్రతీ ఒక్కరి ఆరోగ్యశ్రీ బీమా చేయించాలని కోరారు. గ్రామాలలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధులు నిర్వర్తించటంలో ప్రతీ సచివాలయ ఉద్యోగి కీలకంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పంచాయతీ విస్తర్ణ అధికారి జె.ఎం.రత్నకుమార తదితరులు పాల్గొన్నారు.

సుద్ద అక్రమ రవాణా - ఆగని వ్యాపారం

విశాలాంధ్ర - లింగపాలెం : సుద్ద అక్రమ రవాణాను మాఫియాగ్యాంగ్ తిరిగి మొదలు పెట్టారు. లింగ పాలెం, చింతలపూడి మండలాల్లో అధికారులు నిఘాపెట్టటంతో మాఫియా గ్యాంగ్ తమ మకాంను పెదవేగి మండలానికి మార్చారు. ఈ మండలంలోని రామశింగవరంలో అక్రమ సుద్దను తవ్వి నూజివీడు వైపు తరలిస్తున్నారు. సుద్దను అక్రమంగా తరలించే టిప్పరు లోపల ఏముందో తెలియకుండా కవర్లు కప్పి తోలేస్తున్నారు. అక్రమంగా తరలించే సుద్ద వాహనాలను ఆపి అధికారులకు అప్పగించాలని వలసపల్లి చెక్‌పోస్టు వద్ద కొందరు కాపలా కాసి ఆపేందుకు శనివారం ప్రయత్నించారు. టిప్పరును ఆపకుండా వేగంగా తోలటంతో ఆపటానికి ప్రయత్నించిన వారు పక్కకు తప్పుకోవటంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పుకోగలిగారు. రోజుకు లక్షల్లో ఆదాయం వచ్చే సుద్ద అక్రమ వ్యాపారం చేసేవారు ఏదో విధంగా తమ వ్యాపారాన్ని సాగిస్తూనే ఉన్నారు. గత కొంతకాలంగా అక్రమ సుద్ద వ్యాపారం జరుగుతుంటే గనుల శాఖ అధికారులు పట్టించుకోకపోవటం అనుమానాలకు తావిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండ

- ఎమ్మెల్యే వాసుబాబు

విశాలాంధ్ర - నిడమర్రు: ఆపదలో ఉన్న వారు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి వారికి సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేనని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. శనివారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన యతం నాగ వెంకట దుర్గేష్ ఇటీవల ప్రమాదంలో గాయపడటంతో 16 నెలలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఆసుపత్రి ఖర్చు 40 లక్షల రూపాయలు వ్యయం అవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా శాసనసభ్యులు వాసుబాబు ప్రత్యేక చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ .32,85,000 లక్షల రూపాయలు సహాయాన్ని వాసుబాబు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ రిలీఫ్ ఫండ్ అందుకున్న బాధితులు ఎమ్మెల్యే వాసు బాబుకి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధి

విశాలాంధ్ర- ముసునూరు: తోటి ఎంపిటిసిలు ,అధికారుల సమన్వయ సహకారాలతో ముసునూరు మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళతానని ముసునూరు మండల పరిషత్ అధ్యక్షురాలు కొండా దుర్గాభవాని వెంకట్రావ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముసునూరు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణీ,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజానాయన మాట్లాడుతూ వ్యవసాయం,విద్య,వైద్య రంగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలఅభివృద్ధి బాగుంటుందన్నారు. జలకళ ద్వారా మండలంలోని 16 గ్రామాల్లో 131 బోర్లు వేసినట్టు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు త్వరగా అంచనాలు వేయాలని కోరారు. లోపూడి సర్పంచ్ పేరం కృష్ణ, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ 2020లో ఎన్ఆర్‌జిఎస్ నిధులు లోపూడి గ్రామానికి రెండు లక్షల అరవైతొమ్మిది వేలు, సూరేపల్లి గ్రామానికి రూ.ఐదు లక్షలు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి,ఆ నిధులు మంజూరు కాలేదన్నారు. కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ స్పందించి ముసునూరు మండలం మెట్ట ప్రాంతం కావున రబీ సీజనల్ పంటలైన పొగాకు, మొక్కజొన్న,మిర్చి పంటలు రాత్రి వేళల్లో బోరు నీళ్లు పెట్టుకునే పరిస్థితి లేదు కాబట్టి గతంలో వలే పగలే వ్యవసాయ కరెంట్ త్రిఫేజ్ ఇవ్వాలని ఆ శాఖాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పేరం కృష్ణ,చలసాని దామెదరరావు,పిల్లి సత్యనారాయణ, రాజబోయినశ్రీదేవి శ్రీనివాసరావు, గద్దల సుహాసిని మోహనరావు, కాట్రేనిపాడు ఎంపిటిసి సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిటిసి, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

విశాలాంధ్ర - ముసునూరు: పార్టీలకతీతంగా ముసునూరు మండలాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మండల వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన పేర్కొన్నారు.శనివారం ముసునూరు ఎంపిపి కార్యాలయం వద్ద వారు విలేఖర్లతో మాట్లాడుతూ మండలఅభివృద్ధికి పార్టీలతో సంబంధం లేకుండా సేవ చేయడానికి ,నిధులు మంజూరు చేయడానికి,పారిశుద్ధ్యం,త్రాగు నీరు, వీధులైట్లు మొదలైన పనులు చేయడానికి సిద్దంగా వున్నామన్నారు. సింహాద్రిపురం,కోర్లగుంట ఆర్అండ్‌బి రోడ్డుకు రూ.35లక్షలు, ఎల్లాపురం,బలివే ఆర్అండ్‌బి రోడ్లకు రూ.50లక్షలు,అక్కిరెడ్డిగూడెం రోడ్డుకు రూ.35లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్, వైస్ ఎంపిపి -2 పాముల గంగాధరరావు, ఎంపిటిసి చిలీ లక్ష్మి, సర్పంచ్ కంచర్ల వాణి, రేగుల గోపాలకృష్ణ, ఎంపిటిసి వెంకమ్మ పాల్గొన్నారు.

పాండురంగ స్వామి కార్తీకమాస మహోత్సవం ప్రారంభం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం చేబ్రోలులో శ్రీ రుక్మిణి సమేత శ్రీ పాండురంగస్వామి 33వ కార్తీక మాస మహోత్సవాలకు శనివారం ఉదయం పందిరి రాట ముహూర్తం చేయడం జరిగింది. ఈనెల 24వ తేదీ వరకు మహోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 20న హోమం, 21న కోలాట భజన కార్యక్రమం, 22న పాండురంగ స్వామి కళ్యాణ మహోత్సవం, 23న అగ్నిగుండ మహోత్సవం, 24న అన్న సమరాధనా జరుగుతుందని తెలిపారు. ఉదయం భక్తులు కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు.

శ్రీసీతారాముల కళ్యాణం చూతము రారండి

విశాలాంధ్ర :భీమవరం టౌన్: శ్రీసీతారాముల కళ్యాణం చూతము రారండి అంటూ వైభవోపేతంగా సంప్రదాయ బద్ధంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో నిర్వహిస్తున్న భద్రాద్రి రామయ్య రథయాత్రలో భాగంగా జెపి రోడ్డులోని పద్మావతీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అందించారు. భద్రాచలం ఆలయ ఈవో అనుపోజుల రమాదేవి, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కు స్వాగతం పలికి శేషావస్త్రాన్ని కప్పారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఆలయ ఈవో రుద్రరాజు గంగాశ్రీదేవీ, చైర్మన్ మంతెన రామ్ కుమార్ వర్మ, పాలకవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, లక్ష్మీపతి రాజు ,శ్రీనివాసరాజు ,స్వామి, సాయిబాబు, నాయకులు మానేపల్లి నాగన్న బాబు, రేవూరి గోగురాజు, కొప్పర్తి వీర రాఘవులు, ఏఎస్ రాజు, తిరుమాని ధనుంజయ, కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

విశాలాంధ్ర-వీరవాసరం: విద్యార్థిని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం పెంచుకోవాలని పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం వీరవాసరం శాఖా గ్రంథాలయం గ్రంథ పాలకుడు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్ లో విద్యార్థిని, విద్యార్థులకు దిశా చట్టం, సాధికారిత పైన చర్చ, వ్యాసరచన పోటీలు, తెలుగు భాష వాటి సంరక్షణ ఆవశ్యకత పై వ్యాసరచన, సెమినార్ ను నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం బహుమతులు అందచేస్తామని గ్రంథపాలకుడు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-మండవల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కోలా హలంగా సాగుతున్నాయి. శనివారం వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు చిత్రలేఖనం పోటీలను విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్ఎస్ భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసంద ర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ విద్యతో పాటు ఆటలు, చిత్రలేఖనం తదితర పోటీల్లోను సత్తా చాటితే ఉపాధి అవకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. గ్రంథపాలకురాలు పర్వీన్ మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైప పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని విద్యార్థులు ఇంటికి పుస్తకాలు తీసుకు వెళ్లి చదువుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హైస్కూలు లైబ్రేరియన్ నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

గుంతల ఆంధ్ర ప్రదేశ్‌కు దారేది?

విశాలాంధ్ర -నిడమర్రు: గుంతల ఆంధ్ర ప్రదేశ్ కి దారేది కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ-తెలుగుదేశం పార్టీల ఉమ్మడి పోరాటం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.రాష్ట్రాన్ని పాలిస్తున్న అసమర్థ ముఖ్యమంత్రి గద్దె దించేవరకు జనసేన-తెలుగు దేశం పార్టీలు కృషి చేయాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి సారథ్యంలో ఉంగుటూరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి పై నిరసనగా నిడమర్రు ఎన్టీఆర్ బొమ్మ దగ్గర నుండి మందలపర్రు వంతెన వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పేరుకుపోయిందని, రహదారులు ఛిద్రమైనా పట్టించుకునే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీల మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా ఉండి రహదారులు

విశాలాంధ్ర-ఉండి : నరకానికి రాజమార్గంలో ఉండి రహదారులు ఉన్నాయని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ ఆధ్వర్యంలో గోతుల మయం ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఉండి మండలం వాంద్రం గ్రామ రోడ్డులో శనివారం నిరసన తెలిపారు. ముందుగా ఉండి రిజిస్టర్ ఆఫీస్ సెంటర్ లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి వాంద్రం రోడ్డు వరకు ఈ ర్యాలీగా వచ్చి రోడ్లపై ఉన్న గోతులు వద్ద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరాజు జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గోతులమయంగా ఉన్నాయని ద్విచక్ర వాహన చోటుకులు గోతుల్లో పడి అనేకమంది హాస్పిటల్ పాలవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు నాయకులు స్పందించి తక్షణమే రోడ్డు పునః నిర్మాణం చేపట్టాలని లేనిపక్షంలో కనీసం గోతులైన పూడ్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, తోట ఫణి బాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గవరలక్ష్మి, అనిల్, జుత్తిగ శ్రీనివాసరావు, చెన్నం శెట్టి హరినాయుడు, గురుగుబెల్లి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఎంచుకున్న క్రీడా రంగంలో రాణిస్తే ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు సులభంగా లభిస్తాయని లోటస్ పాఠశాల కరస్పాండెంట్, సెక్రటరీ బొలిశెట్టి రాజేష్ అన్నారు. శనివారం పెదతాడేపల్లిలోని లోటస్ పాఠశాలలో 13వ వార్షికోత్సవం సందర్భంగా బాల, బాలికలకు రన్నింగ్, కబాడ్డీ, త్రో బాల్, హైజంపింగ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కరస్పాండెంట్ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజం అని అన్నారు. ప్రతీ విద్యార్థి ఓటమితో నిరుత్సాహపడకుండా ఎంచుకున్న క్రీడారంగంలో విజయం సాధించేవరకు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. క్రీడలు ఆడటం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా ప్రాధాన్యత కల్పించి ప్రతిభ గల విద్యార్థులకు అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. ప్రిన్సిపల్ ఉమా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ రోజు సుమారు 2 గంటల పాటు క్రీడలు ఆడటం ద్వారా విద్యార్థులు ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఈ ఆటల పోటీల్లో అన్ని విభాగాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు అందజేశారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని వాడవల్లిలో ఆర్బికే కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఖరీఫ్ లో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు వరికోత కోసిన తర్వాత నాణ్యత ప్రమాణాలు పాటించాలని , ఆరబెట్టిన వరిలో తప్ప తాలు మట్టిపెళ్ళలు లేకుండా 17 లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఆర్బికే కేంద్రాల టెక్నికల్ అసిస్టెంట్లు రైతుల వద్ద ధాన్యం నమూనాలు రైతుల వద్ద స్వీకరిస్తారన్నారు. ఎఫ్ టి ఓ పత్రాన్ని రైతు భరోసా కేంద్రాల నుండి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం తోలే వాహనాలకు తప్పనిసరిగా జిపిఎస్ పరికరాలు అమర్చుకోవాలన్నారు. ప్రభుత్వం దాన్యం కొనుగోలును మరింత సరళీకృతం చేసిందన్నారు. గోనేసంచలు , హమాలిచార్జీలు , రవాణా ఖర్చులు రైతులు పెట్టుకుంటే వాటిని రైతులు ఖాతాల్లో జామ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ , సర్పంచ్ , ఎంపీటీసీ , ఆర్బికే ఇన్ చార్జీలు , అధికారులు , నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎంపిపి రామారావు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నూజివీడులో జరిగిన పోడు భూముల పట్టాల పంపిణీకి రావడంతో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ నెంబర్ గంజిమల దేవి, ఆమె భర్త కొయ్యలగూడెం మండల ఎంపీపీ రామారావు ముఖ్యమంత్రి జగన్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గంలోని పార్టీ స్థితిగతులను ఆయనకు తెలియచేసినట్లు ఎంపీపీ రామారావు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు

విశాలాంధ్ర - లింగపాలెం : కె.గోకవరం ఉన్నత పాఠశాలలో స్కూలు, గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టెన్నికాయిట్ జిల్లా స్థాయి పోటీలను శనివారం నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగంలో జరిగిన ఈ పోటీలలో ఉండ్రాజవరం, నిడదవోలు, రామన్నపాలెం, చిన్నాయగూడెం, గోపన్నపాలెం, ఏలూరు, రాజవరం, పోలసానిపల్లి, కె.గోకవరం, జంగారెడ్డిగూడెం, నాగిరెడ్డిగూడెం పాఠశాలల నుంచి 120 మంది బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఒకరోజుపాటుజరిగిన ఈ పోటీలలో అండర్-14, అండర్-17 విభాగంలో ఐదుగురి చొప్పున బాలురు, బాలికలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీలను కె.గోకవరం వ్యాయామ ఉపాధ్యాయులు కె.ప్రకాష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులు నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాలలో దిశ చట్టంపై ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని ఎస్ఐ తెలిపారు. మొబైల్ ఫోనలలో దిశ యాప్ వినియోగించటంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు ఎస్ఐ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం :మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో స్వయంభూవులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో కార్తీకమాసోత్సవములు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శని వారం వారం మూడవరోజు "సప్తాహ మహోత్సవములు" నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీస్వామి వారి తీర్థప్రసాదములు స్వీకరించారు. లక్కవరం - శ్రీమద్ది ఆంజనేయ భజన సమాజం, వేల్పూరు - శ్రీమహాలక్ష్మి భజన సమాజం, జాజులపూడి శ్రీరామభక్త భజన సమాజం, కొయ్యలగూడెం - రామాంజనేయ భజన సమాజం వారిచే "నిరంతర నామ సంకీర్తన" కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి కోటగిరి విద్యాధరరావు, పొన్నాల రవిచందర్, పొన్నాల వెంకట్రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. కోటగిరి విద్యాధర రావు తనయురాలు పొన్నాల అనిత,వైసీపీ నాయకులు మేడవరపు విద్యాసాగర్ స్వామి వారిని దర్శించుకున్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-వీరవాసరం: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం కోసం రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ సుధీర్ తెలిపారు. డిసెంబర్ 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ మంగతాయారు అధ్యక్షతన శనివారం చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్యానల్ లాయర్ ఎస్.సుధీర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సమన్యాయం పొందవచ్చునన్నారు. గ్రామ వాలంటీర్లు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.సుధీర్, కె. ప్రసాద్, డి.రవికిరణ్, ఎస్ఐ పి.రమేష్, కార్యదర్శి, సిబ్బంది, మహిళా పోలీసులు, వాలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 8 నుండి అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె

విశాలాంధ్ర - కాకినాడ : 4ఏళ్ల నుండి పెండింగులో పెట్టిన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయం పక్కన కాకినాడ అర్బన్, రూరల్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహార దీక్షను సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ కంటే అదనంగా అంగన్వాడీలకు వేతనం చెల్లిస్తానన్న జగన్మోహన్ రెడ్డి హామీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు అంగన్వాడీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 8వ తేదీ నుండి అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు జి బేబిరాణి మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్వాడీ సెంటర్లను మెర్జ్ చేశారని, నూతన విద్యా విధానం పేరుతో ఉన్న సెంటర్లను సైతం పాఠశాలల్లో విలీనం చేయడంవల్ల రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల పిల్లలకు పౌష్టికాహారం దూరమవుతుందని విమర్శించారు. . రిలే దీక్షలను నిమ్మరసం ఇచ్చి కాకినాడ నగర అధ్యక్షులు పలివేల వీరబాబు, జిల్లా కోశాధికారి మలకా రమణ విరమింపజేశారు. దీక్షలకు మద్దతుగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడారు. ఒకరోజు రిలే దీక్షలలో ప్రాజెక్ట్ నాయకులు ఎంకే జ్యోతి, ఎం. రాజేశ్వరి, వి. వీరవేణి, సిహెచ్ రమ, ఎండి సుఫియా బేగం, మున్నిరున్నిసా, వి. రమాదేవి, ఎంవీఎస్. నాగమణి, జోగమ్మ, సౌభాగ్య, చామంతి కుమారి, అప్పలకొండ, వీరవేణి, ఎస్ వరలక్ష్మి మరొక 30మంది దీక్షలలో పాల్గొన్నారు.

రేషన్ సరఫరా వాహనాలపై మోదీ ఫొటో ముద్రించాలి

విశాలాంధ్ర -కొవ్వూరు: రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ సప్లయ్ చేస్తున్న వ్యాన్‌లపై ప్రధాని మోధీ ఫొటో ముద్రించాలని కోరుతూ కొవ్వూరు ఆర్.డి.వోకి వినతిపత్రం ఇచ్చినట్లు యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి శివకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు రేషన్ వాహనాల మీద నరేంద్ర మోడీ చిత్రపటాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ రెండో తేదీలోపు రాష్ట్రంలోని అన్ని రేషన్ వాహనాలపై మోడీ చిత్రపటాన్ని వేయాలని లేకపోతే డిసెంబర్ మూడో తేదీ భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశీకృష్ణ నాయకత్వంలో యువమోర్చా ఆధ్వర్యంలో ప్రతి బండిమీద తామే స్టిక్కర్ అంటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా అధ్యక్షుడు బి. వీర మణికంత, బోడపాటి ముత్యాలరావు, జడ్ఎ బేగ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు, ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ ఆరోగ్య సంరక్షణ అవగాహన శిబిరంలో వక్తలు మాట్లాడుతూ మంచి సమాజం రావాలంటే మంచి ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. అనంతరం రాజమహేంద్ర వరానికి చెందిన దంత వైద్య నిపుణులు డాక్టర్ మౌలానా హుస్సేన్, డాక్టర్ కె. నాగార్జున, డాక్టర్ అహ్మద్ మొహిద్దీన్ షేక్, ఆధ్వర్యంలో ఆదిత్య సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలను అందించి అవసరమైనవారికి మందులు, పేస్టును అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సతీష్ కుమార్ మాట్లాడుతూ సదస్సు ద్వారా ఆరోగ్య సూత్రాలు తెలిపి ఆహారపు అలవాట్ల పై అవగాహన ఇవ్వడం మాత్రమే కాకుండా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన నిరసన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని లింగంపర్తి, తిరుమాలి గ్రామాలలో టిడిపి, జనసేన పార్టీ నాయకుల సారథ్యంలో "గుంతల ఆంధ్ర ప్రదేశ్‌కి దారేది" పేరిట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్య బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాలుగా రహదారుల నిర్మాణాలు చేపట్టకపోవడంతో గుంతలు గోతులుగా మారాయని అన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తిరుమాలి రోడ్డులో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట మోహన్, బొద్దిరెడ్డి గోపి, మూదీ నారాయణస్వామి, సూతి బూరయ్య, బస్స ప్రసాద్, మైరాల కనకారావు, సూతి వీర ప్రభాకర్, పలివెల శ్రీనివాస్ తదితరులున్నారు.

అంగన్‌వాడీల నిరహారదీక్షలు

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ శనివారం జగ్గంపేట ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఐసి డిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని, కనీస వేతనాలు అమలు చేయడం లేదని వారు పేర్కొన్నారు. గ్రాట్యుటీ చెల్లించడం లేదని, గర్భిణీలకు బాలింతలకు ఫేస్ యాప్ పెట్టి అదనపు పనిభారం పెంచారని, పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

రేషన్ వాహనాల పై ప్రధాని ఫోటో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - రాజానగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రేషన్ వాహనాల ట్రాక్ లపై దేశ ప్రధాని నరేంద్ర మోడి ఫోటో వెయ్యాలని తూర్పు గోదావరి జిల్లా బీజేపీ యువమోర్చ కార్యదర్శి మోదీ అవినాష్ అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని తహశీల్దార్ కార్యాలయం లో బీజేపీ నేతలతో కలిసి శనివారం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సుమారు 5ఏళ్ళుగా ప్రతి నెల రేషన్ కార్డులో ఉన్న ఒక్కరికీ 5 కేజీల చొప్పున ప్రతి కుటుంబానికి ఉచితంగా బియ్యం అందిస్తుంటే దాన్ని సైతం వైసీపీ తానే ఇస్తున్న ట్లు ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోది సత్తిబాబు, బికిన కామా రాజు, అబ్బారెడ్డి ,పిచ్చుకల సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన సంపదకు గ్రంథాలయాలు వేదికలు

విశాలాంధ్ర - రాజానగరం : విజ్ఞాన సంపదకు గ్రంథాలయాలు వేదికలుగా నిలుస్తాయని రాజానగరం హైస్కూల్ ఉపాధ్యాయుల వంశీ అన్నారు. జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజానగరంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం జరిగిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు లేని ఊరు ఉండదని, విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిరోజు కనీసం ఒక గంట అయినా పుస్తక పఠనం చేయాలన్నారు. దీనిలో భాగంగా స్థానిక హై స్కూల్,ఎంపీపీ నంబర్ 1 స్కూల్ విద్యార్థులకు వివిధ అంశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత గ్రంథాలయాధికారి వందన సమర్పణ చేశారు.

రైతులు లేగ దూడలను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : గ్రామాల్లో పాడి రైతులు ప్రతి ఒక్కరూ లేగ దూడలను కాపాడు కోవాలని బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరావు సూచించారు. శనివారం కాట్రేనికోన మండల పరిధిలోని దొంతికుర్రు గ్రామ పంచాయతీ సమీపంలో పశు సంవర్ధక సహాయకులు డి. సాయి కుమార్ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ఈప్రదర్శనలో హెచ్ఎఫ్ జెర్సీ, గిర్జాతులకు చెందిన ఆడ దూడలను తీసుకొచ్చి రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక సంవత్సరం వయస్సు గల 34 లేగదూడలు పదర్శించారు. అనంతరం రైతులకు బహుమతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిలు బి నాగేశ్వర రావు, ఎల్ విజయ రెడ్డి, పశువైద్య అధికారులు ఎమ్ వెంకట రమణ, భవాని, ఆకుల రమేష్ కుమార్, పి.సుదీర్, టిఎమ్యామిని, స్థానిక సర్పంచ్ దాడి ఈశ్వరి, ఎంపిటిసి రేవు సత్యవతి, సిబ్బంది గణేష్, త్రిమూర్తులు, చక్రవర్తి, శ్రీను, వెంకట రమణ, సాయి, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆదర్శ్ కళాశాల చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులు శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అనురాధ మాట్లాడుతూ..ప్రభుత్వ కళాశాలలో వసతులు, సౌకర్యాలు వినియోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వైవిఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. సమయపాలన, కార్యదీక్షత వంటి మంచి లక్షణాలు అలవర్చుకొని పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆశించారు. అనంతరం కళాశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అఖిలేష్, వివిధ బ్రాంచుల విభాగాధిపతులు, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధం

విశాలాంధ్ర - కరప : వైకాపా నాలుగున్నరేళ్ల పాలనలో విసిగిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓటుతో ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెదేపా రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని జెడ్ భావారం, వాకాడ గ్రామాలలో శనివారం క్లస్టర్ ఇంచార్జ్ దేవు వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి, నులుకుర్తి వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రతి ఇంటికి తిరిగి ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను రిజిస్టర్ చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ..రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబు పాలనే కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బూత్ కన్వీనర్లు గుబ్బల భాస్కరరావు, చోడిశెట్టి కృష్ణ, నాయకులు కంటిపూడి వెంకటరత్నం చౌదరి, పబ్బినీడి సోమరాజు, గున్నం కృష్ణాజీ, రేణుక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కురసాల

విశాలాంధ్ర - కరప : కరపలో అభివృద్ధి నిధులతో నిర్మిస్తున్న బీసీ కళ్యాణమండపం, ఎస్సీ కళ్యాణమండపం, కుళాయి చెరువు వాకింగ్ ట్రాక్ పనులను శనివారం కాకినాడ రూరల్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కమిటీ నాయకులు కురసాల సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పనులు జాప్యం లేకుండా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పిటిసి వై సుబ్బారావు, వైస్ ఎంపీపీ పి భీమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్, ఎంపీటీసీ మద్దూరి గంగ భవాని భాస్కర్, ఎంపీడీవో కే అప్పారావు, పంచాయతీరాజ్ ఏఈ శైలజ, కార్యదర్శి నాగేంద్ర, గోన శ్రీనివాస్, నక్క సత్తిబాబు, మద్దూరి సూర్యనారాయణ, నక్క వీరభద్రరావు, వలసపాకల సర్పంచ్ రామారావు వాకాడ సర్పంచ్ ప్రసాద్, వాలంటీర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

కవి రచయిత లేనిదే సమాజం లేదు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు సందర్భంగా గొల్లప్రోలు పట్టణంలోని స్థానిక మలిరెడ్డి సరస్వతి మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో కుర్ర సుదర్శన కుమారి మెమోరియల్ రీడింగ్ హాల్ నందు రచయితల సందేశాలు, చర్చలు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవి మలిశెట్టి రంగారావు మాట్లాడుతూ గ్రంథాలయాలలో ఉన్న విజ్ఞాన సర్వస్వంను నేటి యువత అభ్యాసనం ద్వారా సంపాదించాలని పేర్కొన్నారు. అనంతరం రచయిత బొజ్జా ప్రసాద్ మాట్లాడుతూ మనిషి అక్షరం నేర్చుకున్న తరువాతే మనిషిలో మార్పు మొదలైనదని, రచయితలు కొన్ని ప్రాంతాలకు పరిమితం కాకూడదని, సమాజాన్ని ధర్మమార్గంలో నడిపించడానికి రచనలు రావాలని కోరారు. నేటి సమాజానికి స్ఫూర్తినిచ్చే రచనలు చాలా అవసరమని సూచించారు. సాహిత్యం లేనిదే చరిత్ర లేదని, కవి రచయిత లేనిదే సమాజం లేదన్నారు. మనిషిలోని జీవానికి ఆవేశం కలబోసి ప్రజా చైతన్యం కలిగించే వ్యక్తులే కవులు, రచయితలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాస్, కొప్పుల కిరణ్, మొగలి శివప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు కర్రి కొండలరావు, చోడపునీడి పుల్లపురాజు, కొమ్ము సత్యనారాయణ, కొశిరెడ్డి త్రిమూర్తులు, పాఠకులు గుండ్ర ప్రసాద్, కేదారిశెట్టి వెంకటేశ్వర రావు, మురమళ్ల పెంటయ్య, తదితర పాఠకులు పాల్గొన్నారు.

భక్తి జనసంద్రం వాడపల్లి దివ్య క్షేత్రం

ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య ఊహించని రీతిలో పెరుగుతోంది. ప్రతి శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడం తెలిసిన విషయమే. అయితే ఏడు శనివారాల వాడపల్లి వెంకన్న దర్శనం. ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడి విశ్వవ్యాప్తం కావడంతో ఇటీవలి కాలంలో శనివారం వస్తున్న భక్తుల సంఖ్య భారీ స్థాయిలో ఉంటోంది. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి తొలి హారతి సమర్పించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు వేకువజాము నుంచే నాలుగు మాడ వీధుల్లో ప్రదక్షిణలు ప్రారంభించారు. భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు, కార్పెట్లు వేసారు. భక్తులకు మజ్జిగ అందించారు. దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు.